# సరుకు

"రాజేశ్వరీ... రాజేశ్వరీ.... నిన్నే లేమ్మా..." అంటూ కూతురిని నిద్ర లేపబోయింది అన్నపూర్ణమ్మ. కూతురు లేవలేదు. తల్లి ఆగలేదు. చివరకు దుప్పటి లాగి కుదిపి కూర్చోబెట్టింది. 'రాజేశ్వరీ.... రాజేశ్వరీ' పిలిచింది. ఎవర్నో పిలిచినట్టు కళ్ళు తెరవని కూతుర్ని చూసి, ఏదో గుర్తుకొచ్చినదాన్లా ఆతృతతో 'హేమా... హేమా...' అందో లేదో, ఆ పిల్ల కళ్ళు తెరవవమే కాదు 'ఏమమ్మా....' అంటూ నోరు తెరిచింది.

కూతురుకున్న క్రమశిక్షణకూ... తు.చ. తప్పకుండా ఆచరించే పద్ధతికీ సంతోషం కన్నా ఆశ్చర్యమే ఎక్కువేసింది అన్నపూర్ణమ్మకి. ఇరవైఏళ్ళుగా పిలుస్తున్న పేరు అలవాటుగా తమ అంగుట్లో కొచ్చినా..., పిలిపించుకునే ఆ పిల్లకెట్లా సాధ్యమయ్యిందో ఆలోచనలో పడింది.

"ఏటి తల్లీకూతుర్లలాగ కూకొన్నారు. లెగిసి పనులు తెమలస్తోటికి అల్లా యేలే అవుతాది. పొయ్యి రాజేసి, పప్పు రుబ్బి, ఎసరకుండలు ఎక్కించి దించి, కూరలు కోసి.... ఈలోగ పిల్లల తాన్నాలు... పెనమెయ్యడం... ముందల ఏమమ్మకి నలుగెట్టి తలకి నీళ్లోసుకుని గుగ్గిలం పొగ పట్టించి... ముస్తాబు సెయ్యించి..." ముసల్ది ఇంకా చదివేదే కాని అలారం అడ్డుకుంది.

అలారం ఆగకుండా కొడుతుండడంతో అన్నపూర్ణమ్మ పూర్తిగా ఆలోచనల నుండి ఇవతల పడింది. అప్పుడు టైము మూడయి వేకువింకా పొడవకపోయినా బారెడు పొద్దెక్కిపోయినట్టు గాబరాగా పెరట్లోకి పరిగెత్తింది.

ముసల్ది రాని నడుమును ఈడ్చుకొని కదుల్తూ "ఏమమ్మా... పేడకడి జాకర్త పెట్టి దాసినాను, కన్ని నీళ్లుకలిపి కళ్లాపి జల్లేత్తా... నువ్వోపాలొచ్చి ముగ్గెట్టు తల్లీ.... నారాజంతాను రాజూ!..." అని చీపురు పట్టుకు పనిలో పడింది.

'రాజు!' ఆ ముద్దు పేరు - 'రాజేశ్వరి' అన్న తన అసలు పేరును గుర్తుకుతెచ్చింది హేమకు! ఈశ్వరీ... రాజేశ్వరీ... అని ఇంటిల్లిపాదీ పిలిచినా 'రాజూ' అని మురిపెంగా పిలుస్తుంది నాయనమ్మ. అలా పిలిపించుకోవడం ఆ పిల్లకీ ఇష్టమే! కాని ఇకపై అలా పిలవడం కష్టమే!

వారం పది రోజులుగా రాజేశ్వరి రాజేశ్వరి కాదు. హేమ. హేమే! చూచిరాత రాసినట్టు వందమార్లు 'హేమ... హేమ' అని రాసుకుంది. ఇంటా బయటా కూడా హేమ.... హేమ.... పిలిపించుకుంది. పలికింది. 'రాజేశ్వరి' అన్న పేరు పొరపాటున కూడా రాకూడదని, క్లాసు పుస్తకాల కంటే కూడా ఎక్కువగా 'హేమ హేమ' అని తన పేరుని తనే కంఠస్తం చేసుకుంది. పడుకొనే ముందు ఒకటికి పదిసార్లు అదే పని!

అన్నయ్యయినా రాజేశ్వరీ అని అలవాటుగానో, ఆకతాయిగానో పిలిస్తే అగ్గయిపోయేవారు అమ్మనుండి నాయనమ్మ దాక.

నాయనమ్మకులాగే కాబోయే భర్తతో 'రాజూ' అని ముద్దుగా పిలిపించుకోవాలని వుండేది. కానీ 'రాజేశ్వరి' అంటే 'రా' అక్షరం తనకి పడదట. తనకంటే తన వివాహ జీవితానికి కుదరదట. ఎందుకంటే అబ్బాయి పేరు 'తేజేశ్వర్రావు'. నామధేయాల్ని బట్టి చూస్తే రాజేశ్వరి కన్యరాశి రెండో పాదం, రాక్షస గణం జంతు లక్షణం పులి. తేజేశ్వర్రావుది తుల రాశి ఒకటో పాదం, రాక్షస గణం జంతు లక్షణం పులి. 'అయితే ఇంకేం సమవుజ్జీ, సరిజోడు' అని అన్నయ్య అంటే.... 'హరే రామ...' అని వినకూడనిది విన్నట్టు పురోహితుడు అరచేత్తో నోరొక్క క్షణం మూసుకున్నాడట. తరువాత చెప్పాడట. మగవాడు రాక్షసుడయినా ఫరవాలేదు. అంటే రాక్షస గణమైనా ఇబ్బంది లేదట కాని ఆడదాని గణం రాక్షస గణం కాకూడదు గాక కాకూడదట. ముఖ్యంగా మగవాడు నలుగుర్లో తిరిగేవాడు. పులి అయినా ఫరవాలేదు. ఆడది మాత్రం పులి అయితే ఇక అంతేనట. గొడవలేనట. ఆ సంసారం సజావుగా సాగదట. అందుకే ఇరవై యేళ్లుగా వున్న పేరు మార్చేసి హేమ అని కొత్త నామకరణం చేశారు. కర్కాటక రాశి, పుష్యమి నాల్గవ పాదం 'హుహేహోడా' .....

హేమ తప్పితే మరో పేరుకు దారిలేదు. దారిలేకపోతేనేం దేవ గణం.... దేవతలా భరిస్తుంది, సహిస్తుంది.... జంతు లక్షణం మేక.... సాధు జంతువు.... "మరి మేకను పులి ప్రేమిస్తుందా? నమిలి చప్పరిస్తుందా?" అన్నయ్యకన్నీ అర్థంలేని అనుమానాలే! అయినా ఆగడే, పోట్లాటకు దిగాడు.

"మన హిందూ సాంప్రదాయం ప్రకారం ఆడపిల్లకి పుట్టినింటి పేర్లే మారతాయి. అలాంటిది పేరు మారడంలో ఇదేమిటి? ఆ మాటకొస్తే జాతకాలు సరిపడి... వచ్చాకే పిల్లని చూస్తున్నారు. చాలామంది ముందు జాతకాలు పంపమంటారెందుకు. అందుకే!? "ముందు పిల్లని చూసినోళ్లు తరువాత పేర్లు సరిపోయాయా లేదా చూసి, నామబలం కోసం ఆడపిల్ల పేరు మారుస్తారు" తండ్రి బోధపరిచాడు.

"ఆడపిల్లలకే ఎందుకు మారుస్తారు?"

"............................"

"నామ 'బలం' కాదు ఆడపిల్ల కంటే మగపిల్లాడికే 'బలం' ఎక్కువని".

"జాతకాలు చూడకుండా లోకంలో ఎవరూ పెళ్ళిళ్ళు చెయ్యరు. పెద్దలు పెట్టింది కాదంటెలగ, కాపోతే నీతో చదువుకుండే సుజాత.... ఆ పిల్లకి నిరుడు పెళ్ళయిపోయింది గాని ఆల అక్కకి ముప్పయ్యేళ్ళు దాటినా కాలే. చూసినోలల్లా తొంభై ఏడు.... మరి మూడేళ్ళు దాక జాతకం బాగులేదట..." తల్లి బోధపరిచింది.

"ఆ లెక్కల్లో నేనెంత అదృష్టవంతురాల్ని" అనుకుంది హేమ అయిన రాజేశ్వరి.

తరువాత ముద్దు పేరును పిలిచిన నాయనమ్మను అమ్మానాన్నే కాక చుట్టాలందరూ తిట్టడం గుర్తుకొచ్చింది. అప్పుడు నాయనమ్మ 'రాజూ' అని అంటూనే తనని తనే అలా పిలిచినందుకు తిట్టుకుంది. అలా పిలిస్తే జాతకరీత్యా ఎంత దోషముందో, వివాహ జీవితం ఎంత కష్టాలపాలవుతుందో నని కాక 'రాజూ' అన్న ముద్దు పేరును పోగొట్టుకున్నందుకు ఎందుకనో ఏడుపొచ్చేసింది. ఏడ్చేసింది. ఎందుకంటే ఇంట్లో అన్నదమ్ముల్తో దేనికైనా పోట్లాడేటప్పుడు 'రాజు' అన్న పేరు ఆడపిల్లని గుర్తుచేసి వెనక్కినెట్టేదే కాదు! ఆ పేరు అదో ధైర్యాన్నిచ్చేది. అందుకే ఆ పేరంటే అంత ఇష్టం. చిన్నప్పటి కథల నిండా రాజులు ధైర్యంతో యుద్ధం చేయడం ఆ పేరు పెట్టుకున్న తనకీ గర్వంగా వుండేది. పెద్దయ్యాక చదువులో రాజే..... సంస్కారంలో రాజే... మాటల్లో రాజే.... 'మా రాజు రాజే!'... అలా ఇంటిల్లిపాది ముద్దు చేసినప్పుడు ఆనందంగా వుండేది. గిల్లికజ్జాలు వచ్చినప్పుడు రాజు కాదు గీజు... బూజు... అంటే అన్నం మాని ఎంతలా

ఏడ్చేది? అలాంటిదిపుడు 'రాజు... రాజేశ్వరి' పూర్తిగా పరాయి పేరయిపోయింది. అయినా ఏడుపు రావడం లేదు. పెళ్ళి కుదరాలంటే ఒక్కోదాన్ని వదులుకోవాలి. అలవాటు పడాలి.

"కళ్లాపి ఏసేన్ను.... ముగ్గెట్టీ నా తల్లీ..."

నాయనమ్మ ఉషారు చూసి లేని ఉత్సాహం తెచ్చుకుని ముగ్గుపెట్టబోయింది హేమ. ఇరవైనాలుగు చుక్కల ముగ్గు వేయమంది నాయనమ్మ. అది కూడా పెళ్ళిముగ్గే వేయమంది. ఈలోపు అన్నయ్య వచ్చాడు. పెళ్ళికాదుగా అన్నాడు. 'ప్రధానం కూడా పెళ్ళిలాంటిదే' అంది నాయనమ్మ. అసలు పెళ్లికి ప్రధానం ముఖ్యమట. ప్రధానంతో తాళి ముడెయ్యడం తప్పితే అన్నీ అయిపోయినట్టేనట. ప్రధానం.... బొట్టు పెట్టడమంటే 'మా పిల్లని' అనిపించుకోవడమేనట...

ఇంకా నాయనమ్మ చెప్పేదే, కాని నాన్న కేక వేశాడు. పెరట్లో తవ్విన జోలు పొయ్యిని అలికి ముగ్గుపెట్టమన్నాడు. హేమ చేతిలో ముగ్గుబుట్టని తీసుకుని నాయనమ్మే కింది పెదవి వణికిపోయి, పై పళ్ళు కొట్టుకుంటుండగా ముగ్గులు పెట్టింది. మనుమరాల్ని ముచ్చటగా చూసింది. తరువాత కుంకుడుగాయ పుల్లతో తలంటి ఆరబెట్టేసరికి తెల్లవారిపోయింది.

సూర్యుడితోపాటే సుమతక్క, సుందరం బావ తమ ఇద్దరు పిల్లలతో దిగబడ్డారు. ఇంకా కాంతం పిన్ని, బాబూరావు మావయ్య.... దగ్గర చుట్టాలెవరో వచ్చారు. సుమతక్క రావడంతోనే హేమను చుట్టేసింది. 'రాజేశ్వరి' అందో లేదో "దాని పేరు ఏమ.... ఏమమ్మ..... అలాగ పిలిస్తేనే మంచిది. పలికిందలాగ.... ఉత్తరంల మీ నాయిన రాయలేదే?!" నాయనమ్మ ఆరా తీసేదే, పెరట్లో పిలుపు... మళ్లీ గొణుక్కుంటూ వెళ్లింది. వెళ్తూనే "కమ్మని జటేసి, సింగారించు,... ముస్తాబు నీదే.... దిష్టిచుక్క దిద్దీమీ...." వీధి చివరకు వినపడేలా వుంది గొంతు.

పరాయివాళ్ళని చూసుకున్నట్టు చూసుకున్నారు అక్కాచెల్లెళ్ళిద్దరూ. సుందరం బావ పలకరించేసి ముఖమయినా కడుక్కోకుండా సిగరెట్ కోసమని జేబు తడుముకున్నాడు. అంత ప్రయాణం బడలికలోనూ... పిల్లలను చూసుకుంటూనే... మరోపక్క తనని పలకరిస్తూనే పరుగెత్తుకెళ్ళి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె బేగ్‌లోంచి భద్రంగా తీసి అక్క ఇవ్వడం హేమని చాలా ఆశ్చర్యపరిచింది.

సుందరం బావ సిగరెట్ ముట్టించాడు. గుండెల నిండా పొగ పీల్చి ముక్కంటా నోటంటా పొగ మేఘాల్లా వదిలాడు. అక్కడే నిలబడ్డ సుమతక్క ముఖం ఆ మేఘాల

నడుమ చంద్రుడిలా చెక్కుచెదరకుండా వుండిపోయిందే కాని ఉక్కిరిబిక్కిరి కాలే. అది చూసి హేమ ఉక్కిరిబిక్కిరయింది. సుందరంబావ సుమతక్కతో ఏదో మాట్లాడుతున్నాడు. హేమకు ఆ మాటలేవీ వినిపించలే. ఆ లుంగలు చుట్టుకులేస్తున్న పొగ ముందర నోరు పెట్టి సుమతక్కా శుభ్రంగా మాట్లాడుతోందే?!....

సుందరంబావ చైన్ స్మోకరట.ఎప్పుడయినా గుండెలు కన్నాలుపడే సుందరం బావ చస్తాడటగాని మామూలుగా చావడట. వరుసైనవాళ్ళు, వరుసగా చూసేవాళ్ళూ అలా అంటారు. అదేమీ ఆశ్చర్యమనిపించలేదు హేమకి. కాని సిగరెట్టుపొగ పడని సుమతక్క ... నాన్న ఇంట్లో కాలిస్తే ఆ పొగకు తిన్నదంతా వాంతి చేసుకొనే సుమతక్క ... చివరకు అగ్గిపుల్ల ముట్టించినా ఆ పొగకే ముక్కుమూసుకొని, ఊపిరిబిగబట్టి, అంటిన చేతుల్ని అరిగిపోయేలా సబ్బుని కరగదీసే సుమతక్క ... వంట్లో తిప్పి అసహ్యాన్ని పెంచే ఆ పొగనే... సాంబ్రాణి ధూపం చేసుకున్న ఈ సుమతక్క ... ఒక్కర్తేనా?!

“ఏమిటే... అప్పుడే పరధ్యానం?'' సుమతి హేమని తట్టి వెనకాలే కూర్చొని జుట్టుముడులు విప్పుతూ దువ్వెనవేసింది.

హేమ జవాబివ్వలేక తబ్బిబ్బయేసరికి సుమతి ఎలా అర్థం చేసుకుందోగాని గుంభనంగా నవ్వుకుంది.

కొద్దిసేపయాక సుమతే అంది ... “ప్రధానం రోజునే పట్టుచీర మీ అత్తవారు పెట్టినమాటెలా వున్నాగాని రెండు తులాల బంగారం గొలుసు, అరతులం ఉంగరం, నాలుగుతులాల వెండిపట్టాలు పెడతారట. ఒక్క కొడుకేనట ... ఆడపిల్లలు తోడపుట్టినవారు లేరట ... పెద్ద బాధ తప్పింది ... చిన్నదానివయినా నాకన్నా అదృష్టవంతురాలివే...''

ఈసారి హేమ మాట్లాడలే. నోరు పెగల్లే. సుమతి ఏమనుకుందో జడ పూర్తిచేసి స్నానానికి వెళ్ళింది.

హేమ అక్క గురించి ఆలోచిస్తే ఆ ఆలోచనలు అమ్మవరకూ పోయాయి. ఎప్పటికప్పుడు పార్టీలని తాగొచ్చిన నాన్న గుర్తుకొచ్చారు. అన్నం వడ్డించమని కలిపి, కక్కి, కెలికీ, సగం కతికీ వదిలేసిన అన్నం అందరూ అసహ్యంతో ... కంపని వదిలేస్తే ... ఇంపుగా ఇష్టంగా తినే అమ్మ గుర్తుకు వచ్చింది. అమ్మకీ, అక్కకీ ఏదో పోలిక దొరికినట్టనిపించింది. తనకీ పోలికుందేమోనని వెతుక్కోబోయింది. హేమ.

“రాజు పిన్నీ! రాకెట్ చెయ్యవా?'' సుమతక్క కొడుకు కాగితం తెచ్చి కదిపేడు. హేమ

కాగితం మడిచి రాకెట్‌చేసి ఇచ్చింది. వాడు దానివెనుక ఊదుతూ గాల్లోకి ఎగరవేయడానికి సిద్ధమౌతున్నాడు.

రాజు పిన్ని! 'రాజు' ముద్దుపేరు గుర్తుకొచ్చింది హేమకు. 'ఆ పేరు తనది కాదు మరి తన ముద్దు పేరో?' 'హే - మా' విడదీసినా ... భాగించినా... గుణించినా ... కలిపినా ... ఏంచేసినా ... అందులోంచి మరో కొత్త పేరు పుట్టలేదు. ముద్దుపేరు దొరకలేదు.

గాల్లోకి విసిరిన రాకెట్ పక్కనే వున్న గోడకు గుద్దుకొని నేలన పడిపోయింది. సుమతి కొడుక్కి బాధవేసింది. హేమ గుండె భారమయింది.

కాంతం పిన్ని "ఆకలితో ఏముంటావు? పెళ్ళికి ఎలాగా ఉపవాసం వుండాలి. ప్రధానంకి పరవాలే" అంటూ హేమ చేతిలో టిఫిన్ పెట్టింది.

సరిగప్పుడే ఇంటిముందు టాక్సీ ఆగింది. అయిదుగురు పేరంటాళ్ళతో, నలుగురు మగవాళ్ళతో మొత్తం తొమ్మిదిమంది దిగేరు. ఫైరింజనొస్తే దారిచ్చేసినట్టు అందరూ దారిచ్చేసి స్వాగతం పలికారు. ఇంటిదగ్గర చేసినవి, ఉదయం తెచ్చినవి సరిపోవనో ఏమోగాని హేమ అన్నయ్య స్వీటు కొట్టుకు పరుగుతీస్తున్నాడు. సుమతక్క అరుగుమీద నీళ్ళబిందె పెట్టి చెంబు అందిస్తోంది. హేమ తండ్రి నవ్వుముఖంతో పొడితువ్వాలును అందించడానికి ఆరాటపడుతున్నాడు.

హేమ టిఫిన్ రెండు ముద్దలు మింగిందో లేదో కాంతంపిన్ని పరుగున వచ్చి, ఏదో జరగకూడనిది జరిగినట్టు ఆయాసపడిపోతూ తింటున్న ప్లేటు లాగేసుకుంది. హేమని ఆ అమ్మాయి తల్లి వేరే గదిలోకి తీసుకువెళ్ళింది. కోపంగా చూసిన తల్లిని చూస్తే హేమకి తన అపరాధమేమిటో అర్థమయింది కాదు.

మగపెళ్ళివారు నట్టింట కాలుమోపడం, సూరీడు నడినెత్తినెక్కడం ఒకేసారి జరిగాయి. వచ్చిన మగవాళ్ళు మాటల్లో పడితే, ఆడవాళ్ళు పెళ్ళికూతుర్ని చుట్టుముట్టారు. క్షణాల్లో మగవాళ్ళకి ఫలహారాలు పళ్లెరాలతో సిద్ధమయ్యాయి. అవయ్యాక భోజనాలట. మగవాళ్ళు భోజనాలు చేశాకే ఆడవాళ్ళు చేస్తారట. అంతలోగా అమ్మాయిని అలంకరిస్తారట.

హేమ వున్న గదిలోనికి మగపెళ్ళివారి ఆడవాళ్ళంతా చేరారు. కాబోయే అత్తగారు గర్వంగా అందరివంకా ఓసారి చూసి పట్టుచీర కవరు విప్పారు. హేమను కట్టుకోమన్నారు. హేమ అందుకుంది. మార్చుకోమన్నట్టుగా చూసింది సుమతి. అందరిముందు తోటి ఆడవాళ్ళయినా, ఎరగనివాళ్ళవడంచేత ... సిగ్గుగా తోచింది.

"లే ... అమ్మా ... మీ అత్తవారు పెట్టిన చీర, జాకెట్టు కట్టుకో. తెచ్చిన వస్తువులన్నీ పెట్టి ఆపైన బొట్టుపెట్టి 'మాపిల్ల' అనిపించుకుంటారు..." ఎవరో ఒకావిడ ఉత్సుకతతో అంది.

హేమ మూలగా చేరి వెనుదిరిగి చీర విప్పేసి లంగా జాకెట్టుపై పట్టుచీర చుట్టుకుంది. పమిటచెంగు అడ్డంపెట్టుకొని జాకెట్టువిప్పి వారు తెచ్చిన జాకెట్టు తొడుక్కుంది. గుండీలు పెట్టుకుంటుంటే ఎవరో సాయపడ్డారు. ఏదోలా ... చికాకుగానో, సిగ్గుతో కూడిన బిడియంగానో వుంది. కాబోయే అత్తగారే తన మెడలోని గొలుసు తీసి హేమ మెడలో వేసారు. పట్టీలు తగిలించారు. ఇవన్నీ జరుగుతున్నప్పుడు ఆవిడ ముఖంలో వెయ్యి ఓల్టుల బల్బు వెలుగుతున్నట్టే వుంది.

నలుగురూ నాలుగు చేతులు వేసి ముస్తాబు చేశారు. "దిష్టిసుక్కో ... " నాయనమ్మ మర్చిపోలేదు. నల్లటిచుక్క బుగ్గన పెట్టారు. బొట్టూ కాటుక్కీ బుగ్గన చుక్కకీ ఏదో జోడీ కుదిరినట్టుగ వుంది.

"నా దిష్టే తగులుతుందేమో ... నా పాడు కళ్లు కూల..." అనేసి మనుమరాలి అందానికి ముగ్ధురాలైపోయి నాయనమ్మ తనని తనే తిట్టుకొని, జోలుపొయ్యి దగ్గర వంటలకాడ ఎవరు పిలిచారో, పిలిచినట్టయిందో వెళ్ళిపోయింది.

హేమను కుర్చీలో కూర్చోబెట్టారు. కాంతం పిన్ని పళ్ళెంలో పసుపుముద్దలో గుచ్చిన గరికవూసలు, హారతికర్పూరం, కుంకుమభరణి ... ఇంకా అక్షితలు పెట్టుకువచ్చింది. సుమతి అందర్నీ పిలుచుకొచ్చింది. గడియారం చూసుకొని ముహూర్తం సరిపోయిందేమో కాబోయే అత్తగారు ముందుకొచ్చి, హేమ నుదుట బొట్టుపెట్టారు. దీవించారు. అందరూ అక్షితలు చల్లారు. ముత్తైదువలు బొట్లు పెడుతుండగ, అత్తగారి పెనిమిటి "అన్నట్టు వుంగరం మరిచిపోయా" అంటూ జేబులోంచి ఎర్రని కాగితపు పొట్లాం అందించాడు. తనకీ గుర్తులేనందుకు నొచ్చుకుంటూనే అతని భార్య పొట్లాం విప్పింది. ఉంగరాన్ని కుడిచేతి ఉంగరం వేలికి తగిలించబోయి ఆగిపోయింది. ఆమె దృష్టి అలానే ఆ వేలిపై నిలిచిపోయింది. వెయ్యి వోల్టేజీ బల్బులాంటి ఆవిడ ముఖంలోని వెలుగు ఆరిపోయి జీరో ఓల్టేజి అయిపోయింది. ఆవిడ ఉంగరాన్ని మరి తొడగలేదు.

కొందరు అనుమానంగా చూశారు. మరికొందరు అర్థంకానట్టు చూశారు. హేమకు మాత్రం ఏదో అర్థమయి చేతిని వెనక్కి లాక్కుంది.

"ఏమయిందమ్మా ... వదినమ్మా..." హేమ తల్లి కంగారుపడింది.

కాబోయే అత్తగారు కాస్తంత ఎక్కువే కంగారుపడ్డారు. తబ్బిబ్బయ్యారు. నోట మాట వచ్చినా మాట్లాడ్డానికి పదాలు వెతుక్కున్నారు. హేమ కూడా బితుకుబితుకుగానే వుంది.

"... నా కుడికన్ను బెదురుతోంది .... ఇందాకటి నుంచి అలాగే వుంది ... అలా బెదరకూడదట, శుభం కాదట ..."

"బొట్టు పెట్టేసారుగదా, మరేమీ పరవాలేదు లేవమ్మా..." ఎవరో సర్దిచెప్పారు.

కొద్దిసేపు నిశ్శబ్దం భయపెట్టింది.

"నా మనసెందుకో కీడు శంకిస్తోంది.... భయంగా వుంది. అసలు బయలుదేరిన దగ్గర్నుంచి ఏదో వొక అపశకునం ఎదురవుతూనే వుంది... అసలే నేనేదీ తట్టుకోలేను... ఆ భగవంతుడు ఎందుకిలా చేస్తున్నాడు... చెప్పానుకదా, చిన్నదానికే తట్టుకోలేనని ... అప్పుడే గుండెల్లో నొప్పి మొదలయింది ... అమ్మా ... అబ్బా ..." కాబోయే అత్తగారు కూలబడిపోయారు. హేమ తప్పుచేసినదానిలా కుర్చీలోంచి లేచి నిలబడిపోయింది.

నాయనమ్మకు నడ్డి రాకపోయినా ఎంత వేగమెళ్ళిందో గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

"డాక్టర్ని పిలుచుకొస్తా..." బాబూరావు మావయ్య పరుగుతీశాడు. కాబోయే అత్తగారు వారించబోయింది. ఫలితం లేదు. సుమతక్క విసనకర్ర తీసుకొని విసరడం మొదలుపెట్టింది. సుందరం బావ 'గాలి తగలాలని' అందర్నీ బయటకు పదమని కేకలేశాడు. కొంతమంది కదిలినా చాలామంది వుండిపోయారు. కొద్దిసేపటికే కూలబడిన కాబోయే అత్తగారు లేచి నిలబడ్డారు. కొంత కుదటపడింది, మరేమీ ఫరవాలేదన్నారు. అయితే మంచి ముహూర్తం చూసుకొని మళ్ళీ రావచ్చునని, ఇప్పటికి వెళ్ళిపోతామనీ అన్నారు. ఇదంతా దేవుడి ప్రాపకం అని ఆవిడ హేమని తీసుకొని దేవుడి గదిలోకి వెళ్ళారు. నమస్కారం పెట్టమంటూనే హేమ రెండుచేతులూ పట్టుకొని వేళ్ళని తడిమారు. ఉంగరంవేలిమీదే చూపు మళ్ళీ మళ్ళీ నిలిచిపోయింది. గోరు ఊడిపోయి బోడిగా మొండిగా వున్న వేలు ... ఆ అరంగుళం తెగిన వేలివంకే అలా చూస్తూ వుండిపోయారు.

"కుంకుడుకాయలు కొడితే చేజారిపోయి ... చిన్నప్పుడే తెగింది ..." ఇంకా హేమ చెప్పేదే. ఆవిడింకేం వినలేదు. గబగబా బయట గదిలోకి వచ్చింది. హేమ వెనకాలే వచ్చింది.

హేమ మెడలో వేసిన గొలుసు వేసిన చేతులతోనే కాబోయే అత్తగారు తీసేశారు. హేమ తుళుక్కుపడింది. పట్టీలు తీయడానికి వంగోగానే ఆవిడతో వచ్చినవాళ్ళు అర్థం చేసుకున్నారేమో, వాళ్ళూ సాయపడ్డారు. చీరని ఒకరెత్తారు. మరొకరు లంగాని ఎత్తారు. హేమకి సిగ్గువేయలేదు. అందరిముందూ అలా జరిగేసరికి వళ్లు చచ్చిపోయింది. అయినా

మనసేమూలో గతుక్కుమనడంతో ... గాబరాతో పెదముడుకులదాక ఎత్తేసిన చీరని దించుకోబోయింది. ఆ ప్రయత్నం చేసేలోపే పట్టాలు తియ్యడం అయిపోయింది. పట్టుచీర ... హేమ వంటిన ఇంకా వుండిపోవడమేమో, ఆవిడింకా కంగారుపడుతోంది. ద్రౌపది వస్త్రాపహరణంలానే చీరని లాగేస్తున్నారు. అందరూ మహాభారతం మననం చేసుకున్నట్టు మాటాడడంలేదు. కొందరు అలానే గుడ్లు నిలేశారు. మరికొందరు సిగ్గుతో చూపులు తిప్పుకున్నారు. హేమ ఇప్పుడు లంగా, జాకెట్టుతో మాత్రమేవుంది. ప్రాణం వున్నా కొయ్యబారిపోయింది. ఆ సన్నివేశంలో ద్రౌపది కృష్ణుడ్ని ప్రార్థించిందెలాగో గాని హేమమాత్రం ఊపిరయినా తీసుకోలేకపోయింది. 'జాకెట్టు' ... కొందరు మగాళ్లు బయటకు వెళ్ళిపోతున్నారు. హేమ జాకెట్టు తీసి ఇవ్వలేకపోవడంతో అదీ వారే చేశారు. లంగా, బాడీ (బ్రా)తో హేమ చచ్చిన శవమయింది. అందరూ కలిసి మూకుమ్మడి అత్యాచారం జరిపినట్టుగా వుంది. నగ్నంగా వున్న నాగరికతమీద గుడ్డకప్పాలంటే, తను గుడ్డ చుట్టుకున్నా సరిపోదనేమో హేమ శిలైపోయింది.

ఇంట్లోనుంచి దొంగలు పారిపోయినట్టు పారిపోతున్నారు.

"... అయ్యో ... వచ్చినప్పుడు మర్చిపోయా, కొత్త చెప్పులు తీసుకున్నామా ... చూడు దీని బెల్టు కొద్దిగ తెగిపోయి వుంది ... మార్చేసుకుందాం ... దార్లోనేకదా షాపు'' అంత కంగారులోనూ మంచి వస్తువు పొందాలన్న వారి ఆరాటం పెదవి మాటున వుండిపోలేదు.

టాక్సీ కదిలిపోయింది. తుఫాన్ వెలిసిపోయినా ఆ నట్టింట దాని బీభత్సమూ ... చేసిన దాడీ ... జరిపిన అత్యాచారం ... ఆనవాళ్ళు పోకుండా అలానే వున్నాయి.

"రాజూ ... రాజమ్మా ... చీరకట్టుకో'' నాయనమ్మ మనుమరాలికి చీర అందించి, అక్కడ నిలబడి చూడలేకనేమో ... దేవుడినే తిడుతోందో ... దేశాన్నే శాపనార్థాలు పెడుతోందో గొణుక్కుంటూ పెరట్లోకి వెళ్ళిపోయింది.

'రాజు' ఆ పేరూ ... పిలుపూ ... ఊరటిచ్చాయేమో, హేమయిన రాజేశ్వరి తన పేరు "హేమ'' ఇక కాదని ... మర్చిపోవడానికి ఆ క్షణం నుండే ప్రయత్నాన్ని మొదలుపెట్టింది.

రచన : *3-12-1993*

ప్రచురణ : ఆంధ్రజ్యోతి వారపత్రిక, *11-3-94*